# అమ్మకోసం



**యు.** పి.పి. స్కూల్లో 5వ తరగతి చదువు తున్నాడు రమేష్. రమేష్ తండ్రి పాపయ్య, తల్లి లక్ష్మమ్మ. కూలీనాలీ చేసుకుంటూ బతుకు బండి దొర్లిస్తున్నారు.

అయ్యా! నేను చదువుకుంటానే... అన్న రమేష్ కోరికను మన్నించి, తన తాత, తండ్రి, తనూ చదువుకోలేదు, 'అడినన్నా చదివిద్దాం' అనుకొని ఆ ఊరి హాస్టల్‌లో చేర్పించి చదివి స్తున్నాడు పాపయ్య. ఊళ్లోనే బడి, హాస్టల్

గనుక రమేష్ ఇంటికొస్తూ పోతుండేవాడు.

సాయంకాలం 7 గంటలయింది. హాస్టల్ లో భోజన గంట కొట్టారు. రమేష్‌తో పాటు పిల్లలందరూ తమతమ కంచాలు, గ్లాసులూ తీసుకొని వరుసగా నిలబడి, కంచాలలో పెడు తున్న అన్నం తీసుకొని, పక్కకుపోయి కూర్చొని తింటున్నారు. కబుర్లు చెప్పుకొంటూ అన్నాలు తిని కంచాలు కడుక్కొని, ఎవరి గదుల్లోకి వారు వెళ్లిపోయారు. కుక్ వంట ఇల్లు సర్దేసి, అన్నిటి మీదా మూతలు పెట్టి హాలులో మంచం వేసు కొని పడుకున్నాడు.

అర్ధరాత్రి అయింది. అందరూ నిద్రాదేవి ఒళ్లోకి వెళ్లిపోయారు. రమేష్‌కు నిద్రపట్టలేదు. చాప మీద పడుకొని అటూఇటూ దొర్లుతున్నా డు. తను ఇంటి వద్ద నుంచి వస్తున్నప్పుడు అమ్మ వుట్టిలోని గిన్నె దించి, కంచంలో అన్నం పెట్టి తనను తినమంది.

తను తింటూ "అమ్మా! నువ్వు తినవేం... అన్నాడు.

నేను తరువాత తింటాను గానీ నీకు టయ మ్ అవుతోంది. ముందు నువ్వు తినెళ్లు" అంది.

తను తినేసి చేయి కడుక్కుంటూండగా అయ్యవొచ్చాడు.

ఆకలేస్తోందే... అంటూ అమ్మను అడక్కుం డానే గిన్నె అందుకొని, అందులోని నాలుగు అన్నం ముద్దలూ తినేసి, గిన్నె అక్కడే పడేసి వెళ్లిపోయాడు.

కుండలోని మంచినీళ్లు రెండు గ్లాసులు తాగి మూతి తుడుచుకుంది అమ్మ.

"అమ్మా! నీకన్నం ఏది? అంటే... "అయ్య బయటకెళ్లాడుగా... ఏదో తెస్తాడులే... వండు కొని తింటాను గానీ నువు బేగెళ్లు బాగా చదువు కో" అంది.

పుస్తకాల సంచి భుజాన వేసుకొని తను బయలుదేరి వచ్చాడు. అయ్య ఏమయినా తెచ్చాడా? అన్నం వండుకొని తిన్నారా? అమ్మ ఎపుడూ పస్తే.

అన్నం తిందో లేదో! అన్న ఆలోచన బుర్ర లో తొలిచేస్తుంటే నిద్ర దూరంగా పారిపో యింది. లేచి కూర్చున్నాడు. అంతా నిశ్శబ్దం. ఎక్కడో దూరాన కుక్కలు భౌభౌ మంటున్నాయి. తన చోటులోంచి మెల్లగా లేచాడు. పెట్టె తెరిచి కంచం తీసుకున్నాడు.

అడుగులో అడుగు వేస్తూ హాస్టల్ వంటగది వైపు బయలుదేరాడు. హాలులో మంచం మీద పడుకొని గుర్రుకొడుతూ నిద్రపోతున్నాడు హాస్టల్ కుక్. మెల్లగా వంటగదిలో గిన్నెల వైపు వెళ్లి, అన్నం గిన్నె మూతతీసి కంచం నిండుగా అన్నం పెట్టుకొని అడుగులో అడుగేస్తూ బయ టకు వస్తున్నాడు.

హాస్టల్‌లోని కుక్క ఒక్కసారిగా భౌ...మని అరవటంతో మెలకువ వచ్చి మంచం మీద నుంచి లేచాడు కుక్. అన్నం కంచంతో బయ టకు వెళుతున్న రమేష్ కన్పించాడు.

దొంగ... దొంగ... అంటూ వెంట పరిగెత్తి, రమేష్‌ని దొరకపుచ్చుకొని... ఎవడురా! నువ్వు? దొంగలాగా అన్నం ఎత్తుకుపోతు న్నావ్? అంటూ రమేష్ వంక పరకాయించి చూశాడు.

"అరే! రమేష్... నువ్వా? ఇదేమిట్రా... అన్నం దొంగతనం చేస్తున్నావా?" అంటూ అన్నం గిన్నెతో రమేష్‌ని తీసుకొని, హాస్టల్ వార్డెన్ ముందు నిలిచి "సార్! ఈ రమేష్

## కె.వి.ఆర్. హనుమంతరావు

అర్ధరాత్రి వంటగదిలో దూరి అన్నం దొంగతనంగా ఎత్తుకుపోతున్నాడు... అని చెప్పాడు

"ఏరా! ఇదేం పని? అన్నం ఎత్తుకు పోతున్నావా? ఎన్నాళ్ల నుంచి చేస్తున్నావ్ ఈ పని? అంటూ రెండు అంటించి, పద హెడ్‌మాష్టర్ గారి దగ్గర తేల్చుకుందాం" అంటూ రమేష్‌ని రెక్క పట్టుకొని హెడ్‌మాష్టర్ ముందు నిలబెట్టి, "సార్! ఈ రమేష్ అన్నం దొంగతనం చేస్తుంటే మన కుక్ పట్టుకున్నాడు" అన్నాడు వార్డెన్.

"ఏరా! రమేష్! అన్నం దొంగతనం చేస్తావా? సిగ్గులేదూ" అన్నాడు హెడ్‌మాష్టర్.

రమేష్ తలవంచుకొని నిలబడ్డాడు. హాస్టల్‌లో పిల్లలు అందరూ చుట్టూ చేరారు.

"వీడిని పోలీసులకు అప్పగించండి సార్. అంతా వాళ్లే చూసుకుంటారు" అన్నాడు వార్డెన్.

"ఆ...వాళ్లదాకా దేనికి? అదో గొడవ. రెండు తగిలిస్తే సరి... వాడే బుద్ధిగా పడివుంటాడు అంటూ బెత్తం అందుకొని, 'అన్నం దొంగతనం చేసినందుకు శిక్ష' ఇంకెపుడు ఇలా చేయవుగదా అంటూ బెత్తంతో రెండు చేతుల్లో పది దెబ్బలు వేసి, పోరా! పో! బుద్ధిగా వుండు. ఇంకెపుడూ ఇలాంటి పనిచేయకు!" అంటూ బెత్తం పక్కకు విసిరేసాడు హెడ్‌మాష్టర్.

రమేష్ బెక్కుతూ "సార్! కొడితే కొట్టారు గానీ ఆ అన్నం కంచం నాకిప్పించండి సార్! ఇంకెపుడూ ఇలా చేయను. ఇదే మొదలు, ఇదే ఆఖరు. ప్లీజ్ సార్!" అంటూ ఏడ్వసాగాడు.

"అన్నం గిన్నె ఇప్పించాలా? ఎందుకు? రాత్రి బాగానే మెక్కావు గదా? చాలలేదా? అది పొట్టా, చెరువా?" అన్నాడు వార్డెన్.

"సార్! ఆ అన్నం నాకు కాదు సార్... మా అమ్మకు. మా అమ్మ అన్నం తిని మూడు రోజులయింది సార్! ఆమెకు రెండు ముద్దలు పెడదామని హాస్టల్‌లో మిగిలిపోయిన అన్నం కొద్దిగా తీసుకున్నాను సార్. ఇంకెపుడూ చేయను ఆ అన్నం నాకు ఇప్పించండి. సార్" అంటూ ఏడ్వసాగాడు రమేష్.

హెడ్‌మాష్టర్ మనసు కరిగిపోయింది. "ఏరా! ఆ సంగతి ముందే చెప్పొచ్చు గదా! కుక్‌ని అడిగితే పెట్టకపోయాడా? అనవసరంగా దొంగతనం చేసి దెబ్బలు తిన్నావు గదరా!" అంటూ "ఆ అన్నం ఆ అబ్బాయికిచ్చి, మరి కొంచెం పెట్టి పంపించు" అంటూ కుక్‌కి చెప్పి, వెళ్లిపోయాడు.

పాపం రమేష్‌కి ఆళ్ల అమ్మ అంటే ఎంత ప్రేమో చూడరా! అమ్మ కోసం దెబ్బలు కూడా తిన్నాడు. అంటూ పిల్లలు అందరూ సానుభూతి చూపించారు.

అన్నం కంచంతో ఇంటి కెళ్లాడు రమేష్. కన్నీళ్లతో చారలు కట్టిన బుగ్గలు, ఎర్రగా కందిపోయిన చేతులతో అన్నం ముద్దలు తీసి అమ్మకు అందిస్తూ "అమ్మా! తిను! అయ్య వస్తే నీకసలు వుండదు..." అంటూ గబగబా అమ్మ నోట్లో ముద్దలు కుక్కసాగాడు.

"దెబ్బలు తింటే తిన్నాగానీ అమ్మ కోసం ఇంత అన్నం తెచ్చాను అదే చాలు..." అంటూ మురిసిపోయాడు రమేష్.

"నా కోసం దెబ్బలు తిన్నావా నాన్నా!" అంటూ బావురుమంది తల్లి.

ఆ తల్లీ కొడుకులను చూస్తున్న వారి కళ్లు చెమ్మగిల్లాయి. ●